క్లుప్తంగా

నేడు ప్రముఖ వైద్య నిపుణుల రాక

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో ఆదివారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ఆదివారం మధ్యాహ్నం కర్నూలు విశ్వభారతి ఆసుపత్రి నుండి ప్రముఖ గుండె జబ్బుల వైద్య నిపుణులు డాక్టర్ హితేష్‌రెడ్డి గుండె సంబంధిత జబ్బులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ప్రముఖ క్యాన్సర్ వ్యాధి నిపుణులు డాక్టర్ డి.నిహారిక క్యాన్సర్ అవగాహన, స్క్రీనింగ్, క్యాన్సర్ రోగులను క్రమం తప్పుండా అనుసరించడం, ఇతర క్యాన్సర్ సంబంధిత సంప్రదింపులు ఉంటాయన్నారు. గుండె జబ్బులు, క్యాన్సర్ సమస్యలతో బాధపడుతున్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ ఇసీ దినేష్‌రెడ్డి తెలిపారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

నేడు గంగమ్మ జాతర

కమలాపురం : పట్టణంలోని మార్కెట్ సెంటర్‌లో వెలసిన శ్రీ గంగమ్మ ఆలయంలో ఆదివారం కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో గంగమ్మ జాతర నిర్వహించనున్నారు. అలాగే కె.అప్పాయపల్లె, ఎర్రగుడిపాడు, కోగటం, కంచన్నగారిపల్లె, సి.గోపులాపురం తదితర గ్రామాలలో సైతం గంగమ్మ జాతర నిర్వహించనున్నారు. ఇప్పటికే ఆయా గ్రామాల్లో గంగమ్మ ఆలయాల వద్ద భక్తులు భోనాలు సమర్పించడంతో పాటు పూజలు చేయడం, జంతు బలులు ఇచ్చేందుకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు. పట్టణంతో పాటు గ్రామాల్లోని ప్రతి ఇల్లు బంధువులు, సన్నిహితుల రాకతో కళ కళ లాడుతోంది. కాగా శనివారం రాత్రి ఎర్రగుడిపాడు గ్రామంలో లక్ష్మీ చెన్నకేశవస్వామి ఊరేగింపు నిర్వహించారు. భక్తుల కోలాహలం నడుమ ఊరేగింపు గ్రామంలోని అన్ని కాలనీల్లో సాగింది. అనంతరం గంగమ్మ అమ్మవారిని ప్రతిష్టించారు. సోమవారం ఉదయం గంగమ్మను సాగనంపుతామని కమిటీ సభ్యులు తెలిపారు.

ఎంపీ నిధులతో సీసీ రోడ్డు ఏర్పాటు



ఎంపీ నిధులతో వెలమవారిపల్లెకు వేసిన సీసీ రోడ్డు

పులివెందుల రూరల్ : పట్టణంలోని కడప రోడ్డు నుంచి పులివెందుల – వెలమవారిపల్లె గ్రామానికి వెళ్లే దారి అధ్వానంగా ఉండటంతో వాహనదారులు, పాదాచారులు తీవ్ర ఇబ్బందులు పడుతుండేవారు. ఈ నేపథ్యంలో కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి గ్రాంటు కింద సుమారు రూ.4.90 లక్షలతో సిమెంటు రోడ్డును ఏర్పాటు చేశారు. సీసీ రోడ్డు ఏర్పాటు చేయడంతో ప్రజలు, వాహనదారులు ఎంపీకి కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్‌ఎస్‌కే సిబ్బందిని కలవండి

సింహాద్రిపురం : గతంలో పాడా కింద పైపుల కొరకు డీడీలు తీసిన 203 మంది రైతులు ఆర్‌ఎస్‌కే సిబ్బందిని కలవాలని ఏఓ శివమోహన్ రెడ్డి సూచించారు. శనివారం స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ సచివాలయాల్లో ఆర్‌ఎస్కే సిబ్బంది వద్దకు వెళ్లి పైపుల కొరకు మళ్ళీ దరఖాస్తులు చేసుకోవాలన్నారు. గతంలో కట్టిన 203 మంది రైతులు తమకు కావలసిన వివిధ ఇంచీల పైపుల కొరకు దరఖాస్తులు చేసుకుని డీడీలు కట్టారని, కానీ వివిధ రకాల ఇంచీల పైపులు ఇవ్వడం లేదని, కేవలం రెండించి పైపులు మాత్రమే ఇస్తున్నారన్నారు. ఈ మేరకు ఉన్నతాధికారుల నుంచి వచ్చాయన్నారు. గతంలో డీడీలు కట్టిన రైతులు ఇది గమనించి ఆయా ఆర్‌ఎస్‌కే కేంద్రాలలో మళ్లీ దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

ఇళ్లు మంజూరు చేయాలి

జమ్మలమడుగు : అర్హులైన ప్రతి ఒక్కరికి పీఎం ఆర్‌వై, ఎన్‌డీఆర్ ప్రభుత్వ గృహాలను మంజూరు చేయాలని ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ మాజీ కమిటీ సభ్యుడు మేకల ఆంజనేయులు కోరారు. శనివారం ఆయన జిల్లా గృహనిర్మాణ సంస్థ కార్పొరేషన్ మేనేజర్ తులసీరామ్‌కు వినతి పత్రం అందజేసి మాట్లాడారు. కొంత మంది ఉచిత గృహాలకు అర్హులుగా ఉన్నా ఆధార్ ఫీడింగ్‌లో జరిగిన తప్పుల వల్ల ఇబ్బంది పడుతున్నారన్నారు. గతంలో ఇళ్లు మంజూరు కాకున్నా వచ్చినట్లు ఆన్‌లైన్‌లో నమోదు కావడంతో లబ్ధిదారులు నష్టపోతున్నారన్నారు.

ప్రారంభమైన ఉత్సవాలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

వల్లూరు : మండలంలోని వెంకటాపురం వీవర్స్‌కాలనీలో వెలసిన శ్రీ చౌడేశ్వరీదేవి జ్యోతి ఉత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం గ్రామంలో చల్ల కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం బిందె సేవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామోత్సవంగా వెళ్లి పూజలు నిర్వహించారు. మొక్కుబడుల రూపంలో భక్తులు రాత్రి జ్యోతుల తయారీని ప్రారంభిచారు.

నిబంధనలు గాలికి.. అదనంగా రూ.50 వసూలు



గ్యాస్ ఏజెన్సీ వద్ద సరఫరాకు సిద్ధంగా సిలిండర్లు

పులివెందుల రూరల్ : పేద, ధనిక అనే తేడా లేకుండా గ్యాస్ ప్రతి ఇంటిలో నిత్యావసర వస్తువు. ప్రతి ఒక్కరూ గ్యాస్ వినియోగించే వంట చేస్తున్నారు. అయితే వినియోగదారుల అవసరాన్ని గుర్తించిన గ్యాస్ ఏజెన్సీలు ఇష్టమొచ్చిన విధంగా డబ్బులు వసూలు చేస్తున్నారు. నిబంధనలు కూడా గాలికి వదిలేసి ఇష్టారాజ్యంగా డబ్బులు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కేంద్ర పెట్రోలియం మంత్రిత్వ శాఖ నిర్ణయించిన ధరలు కాకుండా గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు నిర్ణయించిన ధరలకు గ్యాస్ సిలిండర్లను విక్రయిస్తున్నారు. గ్యాస్ సరఫరా మాటున వినియోగదారులపై అదనంగా రూ.50లు వసూలు చేస్తున్నారు. కొంతమంది సిబ్బంది చిల్లర పేరుతో వినియోగదారులను దోచుకుంటున్నారు. ఇలా సిలిండర్ కొన్న ప్రతిసారి నష్టపోవాల్సి వస్తుందని గ్యాస్ వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పులివెందుల ప్రాంతంలో సుమారు 20వేల గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. రోజుకు 1000 సిలిండర్ల పైగానే డెలివరీ చేస్తుంటారు. వారితో డెలివరీ చేసినందుకు అదనంగా రూ.50లు కూడా వసూలు చేస్తున్నారు.

గ్యాస్ సిలిండర్ల సరఫరాలో నిబంధనలు

గ్యాస్ సిలిండర్ల సరఫరాలో గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు ఐదు కిలోమీటర్ల పరిధిలో వినియోగదారులకు గ్యాస్ ఉచితంగా డెలివరీ చేయాలని నిబంధన ఉంది. కానీ ఏజెన్సీ నిర్వాహకులు మాత్రం ఒక కిలోమీటర్ ఉన్నా, ఐదు కిలోమీటర్ల ఉన్న రూ.50లు అదనంగా డబ్బులు వసూలు చేస్తున్నారు. కేంద్ర పెట్రోలియం మంత్రిత్వ శాఖ విధించిన నిబంధనలను ఏజెన్సీ నిర్వాహకులు గాలికి వదిలేశారు. సిలిండర్లు నిల్వ ఉంచే గోదాముల్లో కట్టుదిట్టమైన భద్రతలు ఏర్పాటు చేయాలి. కానీ అలాంటి చర్యలేవి తీసుకోవడంలేదు. దీనిపై సంబంధిత అధికారులు కూడా చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్యాస్ ఏజెన్సీలే కాక ప్రైవేట్ వ్యక్తులు కూడా అదనంగా డబ్బులు తీసుకుంటూ హోటళ్లకు, పానీపూరి సెంటర్లకు, బేకరీలకు సిలిండర్లను సరఫరా చేస్తున్నారు. అలాగే అధికారుల సరైన పర్యవేక్షణ లేకపోవడంవల్లే గ్యాస్ ఏజెన్సీలు ఇలా వ్యవహరిస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గ్యాస్ ఏజెన్సీలు సిలిండర్ సరఫరాలో అదనంగా డబ్బులు వసూలు చేయకుండా తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఇంకుడు గుంతలు తవ్వుకోండి



సి.గోపులాపురంలో ఇంకుడు గుంతను తవ్వేందుకు భూమి పూజ చేస్తున్న సిబ్బంది

కమలాపురం : రైతులందరూ తమ పొలంలోని కొంత విస్తీర్ణంలో ఇంకుడు గుంతలు తవ్వుకోవాలని తద్వారా పొలాల్లో భూ గర్భ జలాలు పెరుగుతాయని ఎంపీడీఓ జ్యోతి తెలిపారు. శనివారం మండలంలోని సి.గోపులాపురం గ్రామంలో చింత కుంట ఓబుళమ్మ అనే మహిళా రైతు పొలంలో ఇంకుడు గుంతను ఆమె తవ్వించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ఉపాధి హామీ పథకం ద్వారా ఉచితంగా ఇంకుడు గుంతలను తవ్విస్తుందన్నారు. రైతులు స్పందించి తమ పొలాల్లో కొంత విస్తీర్ణంలోనైనా గుంతలు తవ్వుకోవాలన్నారు. దీని వలన భూగర్భ జలాలు పెరగడంతో పాటు అత్యవసర కాలంలో ఈ నీటిని వినియోగించు కోవచ్చన్నారు. నీటి సంరక్షణకు రైతుల పొలాలకు ఈ గుంతలు ఎంతో అవసరం అన్నారు. అలాగే ఆ గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. మస్టర్ తనిఖీ చేశారు. కూలీల సంఖ్యను పెంచాలని సిబ్బందికి సూచించారు. అనంతరం గ్రామంలో ఇంటింటికి తిరిగి పారిశుద్ధ్యం పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. చెత్తా చెదారాన్ని రోడ్లపై వేయవద్దని సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ పార్థ సారధి, రైతులు పాల్గొన్నారు.

ఎస్ఐకి వినతి

ఎర్రగుంట్ల : ఆర్టీపీపీ నుంచి వస్తున్న ఫ్లెయాష్‌ను కొందరు అధికలోడుతో తరలిస్తుండటంతో ఆర్టీపీపీ చుట్టు పక్కల గ్రామాల ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారని శనివారం కలమల్ల ఎస్ఐ తిమోతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్టీపీపీ నుంచి వస్తున్న ఫ్లెయాష్‌ను టిప్పర్లు, ట్యాంకర్లలో అధిక లోడుతో తీసుకుని పోతూ రోడ్లపై పడేస్తున్నారన్నారు. అధిక లోడుతో వచ్చే వాహనాలను సీజ్ చేయాలని కోరారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలలో ప్రతిభ చూపిన విద్యార్థులతో కళాశాల అధ్యాపకులు

వేంపల్లె : వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ రాష్ట్రస్థాయి పోటీలకు ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు ఎంపికైనట్లు ఆర్కేవ్యాలీ ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ కుమారస్వామి గుప్తా తెలిపారు. శనివారం స్థానిక ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో ఆయన మాట్లాడుతూ కడప నగర సమీపంలోని కేఎస్‌ఆర్‌ఎం కళాశాలలో జిల్లా నెహ్రూ యువకేంద్ర ఆధ్వర్యంలో వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ 2025 రీజనల్‌స్థాయి పోటీలు జరిగాయన్నారు. ఈ పోటీలకు కడప, అన్నమయ్య జిల్లాల నుంచి దాదాపు 200 మంది విద్యార్థులు హాజరయ్యారని, కళాశాలలో ఇంజనీరింగ్ మూడవ సంవత్సరం చదువుతున్న దస్తగిరిబాషా, కంభగిరిస్వామి, హేమంత్‌కృష్ణ, వెంకట సాయినాథ్ రెడ్డిలు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులను డైరెక్టర్ కుమారస్వామి గుప్తా, పరిపాలన అధికారి డాక్టర్ రవికుమార్ అభినందనలు తెలిపారు. జిల్లాస్థాయి నుండి రాష్ట్రస్థాయికి ఎంపికైన 10 మంది విద్యార్థులలో నలుగురు ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు ఎన్నిక కావడం గర్వించదగ్గ విషయమన్నారు. జాతీయ సామజిక సేవ 6వ సంఘం అధికారి కోనప్ప, సహాయ ఆచార్యులు కల్యాణ చక్రవర్తి పర్యవేక్షణలో విద్యార్థులు రాణించారన్నారు.

నీరు చాలా విలువైంది



విద్యార్థినికి సర్టిఫికెట్‌ను అందిస్తున్న కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.మాధవ

పులివెందుల : పర్యావరణ, వ్యవసాయ, పారిశ్రామిక, ఆహార ఉత్పత్తుల రంగానికి నీరు చాలా అవసరమని ఫుడ్‌అండ్ సైన్స్ టెక్నాలజీ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.మాధవ తెలిపారు. శనివారం పట్టణంలోని స్థానిక ఫుడ్‌అండ్ సైన్స్ టెక్నాలజీ కళాశాలలో ప్రపంచ నీటి దినోత్సవ వేడుకలలో ఆమె పాల్గొని మాట్లాడారు. మానవ ఆరోగ్యం, పారిశుద్ధ్యానికి నీరు ఎంతో అవసరమని, నీటి వనరులను వృథా కాకుండా చూసుకోవాలన్నారు. భవిష్యత్‌లో సురక్షితమై నీరు దొరకడం ప్రశ్నార్థకమవుతోందన్నారు. ఆహార ఉత్పత్తుల రంగాలలో నీరు వృథా కాకుండా తగినంత నీరు వాడుకోవటంలో ఫుడ్ టెక్నాలజిస్టులు పాత్ర కీలకమన్నారు. అనంతరం విద్యార్థినులు సుప్రియ, జ్యోతిర్మయి, మహాలక్ష్మి, భవాని, సంయుక్త, దివ్యలు ప్రపంచ నీటి దినోత్సవం థీమ్ గ్లేసియర్ పరిరక్షణ గురించి మాట్లాడారు. ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా విద్యార్థులచే నీటిని సంరక్షించుకోవడం అనే అంశంపై ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం సాహిత్య పోటీలలో గెలుపొందిన విద్యార్థినులకు అసోసియేట్ డీన్ మాధవ సర్టిఫికెట్లు, బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ రాజేష్, డాక్టర్ నివేదిత, అరుణ, కీర్తిరెడ్డి, జయమ్మ, సాయి శ్రీనివాస్, సుబ్బారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

ముసిపల్ కౌన్సిల్ సమావేశం రచ్చరచ్చ

- ఇంటి పన్నులు కట్టలేదని ఆస్తుల సీజ్‌పై రచ్చ
- నీటి కులాయి కనెక్షన్‌ల తొలగింపుపై వాగ్వివాదం



సమావేశంలో అధికారులతో వార్డు సమస్యలపై మాట్లాడుతున్న కౌన్సిలర్

ఎర్రగుంట్ల : స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శనివారం మున్సిపల్ చైర్మన్ ఎం.హర్షవర్ధన్‌రెడ్డి అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కౌన్సిలర్లకు, అధికారులకు మధ్య వాగ్వివాదం రచ్చరచ్చగా మారింది. దీంతో కౌన్సిలర్ మహమ్మద్ ఆలీతో పాటు మిగతా కౌన్సిలర్లు ఒక్కొక్కరిగా మధ్యలో వెళ్లి పోయ్యారు. అజెండాలోని అంశాలపై చర్చ జరగకుండానే సమావేశం ముగిసింది. కౌన్సిలర్లు అడిగిన సమస్యలకు మున్సిపల్ కమిషనర్ శేషఫణి సమాధానాలు చెప్పారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు మహమ్మద్ ఆలీ, నాగిరెడ్డి, ఎరికలరెడ్డి, కో ఆప్షన్ సభ్యులు డి. సూర్యనారాయణరెడ్డిలు మాట్లాడుతూ ఎన్నడూలేని విధంగా ఇంటి, నీటి పన్నులను వసూళ్లు చేస్తున్నారని, కనీసం సమాచారం ఇవ్వకుండా పెండింగ్‌లో పన్నులను వసూళ్లు చేసుకోవడానికి ఆస్తులు జప్తు, నీటి కులాయి కనెక్షన్‌లు కట్ చేస్తున్నారని మండిపడ్డారు. కౌన్సిలర్లు కనీసం సమాచారం ఇవ్వకుండా నీటి కనెక్షన్‌లు కట్ చేయడం ఏమిటని ప్రశ్నించారు. గత ఐదేళ్లల్లో ఇలాంటి దారుణం జరగలేదన్నారు. 6వ వార్డులో విద్యుత్ స్తంభం రోడ్డుకు మధ్యలో ఉందని ఇది కూడా పెద్ద లైన్ కావడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని కౌన్సిలర్ నాగిరెడ్డి వాపోయ్యారు. దీనిపై కనీసం మున్సిపల్ అధికారుల స్పందన లేదన్నారు. డ్రైనేజీలో పూడికలను మున్సిపల్ కార్మికులతోనే తీయించారుకదా మరి లక్షల్లో బిల్లులు ఏవిధంగా ఖర్చు అయ్యాయని ప్రశ్నించారు. అలాగే మున్సిపల్ కౌన్సిలర్లకు చెప్పకుండానే అజెండాలో అంశాలను ఏవిధంగా నమోదు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రతి సమావేశానికి కౌన్సిలర్లు వచ్చి బిస్కెట్లు, టీ తాగి తిరిగి పోవడం జరుగుతుందన్నారు. కొందరికి లబ్ధి చేకూరే విధంగా అజెండా ఉంటుందన్నారు. గత సమావేశంలో ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి పాల్గొని వార్డులలోని సమస్యలను కౌన్సిలర్లను అడిగి తెలుసుకోవాలని చెప్పారు. దీనిపై మున్సిపల్ కమిషనర్ స్పందించి కౌన్సిలర్లు కాంట్రాక్టు పనులు చేయకూడదని సమాధానం చెప్పారు.

మోకాలుతో నడుచుకుంటు వస్తా..

మా వార్డులో కాలువలను ఏర్పాటు చేయకపోతే మా ఇంటి నుంచి మోకాలుపై నడుచుకుంటూ మున్సిపల్ కార్యాలయం వద్దకు వస్తాను అని కౌన్సిలర్ ఎరికలరెడ్డి తెలిపారు. వార్డులలోని సమస్యలను పరిష్కరించమని చాలా సార్లు ఆర్జీలు ఇచ్చినా ఏమి ప్రయోజనం లేదన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ చంద్రకళ, కౌన్సిలర్లు యర్రంరెడ్డి లావణ్య, జంషిద్, లక్ష్మీదేవి, పెన్నారషీద్, నాగిరెడ్డి, మహమ్మద్ ఆలీ, ఎరికలరెడ్డి, కో ఆప్షన్ సభ్యులు డి.సూర్యనారాయణరెడ్డి, మహమ్మద్‌గౌస్, మేనేజర్ పుల్లయ్య, అధికారులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

చింతకొమ్మదిన్నె : మండలంలోని పంచాయతీ కార్యదర్శులు(గ్రేడ్ 1 నుండి 6 వరకు) స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శనివారం సమావేశం నిర్వహించారు. అనంతరం రాష్ట్ర పంచాయతీరాజ్ అసోసియేషన్ వారి ఆదేశానుసారం కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు మండల ఈఓ పీఆర్‌డీ వెంకటసుబ్బారెడ్డి తెలిపారు. గౌరవాధ్యక్షుడిగా ఎస్.శాంతమ్మ, అధ్యక్షుడిగా యు.వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడిగా జి.ఎల్. నారాయణరెడ్డి, మహిళా అధ్యక్షులుగా ప్రేమలత, కోశాధికారిగా శ్రీనివాసులు, జనరల్ సెక్రటరీగా సంపత్‌కుమార్‌రెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే గ్రామ పంచాయతీ స్థాయిలో పంచాయతీ కార్యదర్శులు ఎదుర్కొంటున్న సమస్యలు, పనిభారాన్ని తగ్గించాలని ఎంపీడీఓ కుల్లాయిబాబుకు వినతి పత్రాన్ని అందజేసినట్లు తెలిపారు.

తడి చెత్త, పొడి చెత్తపై అవగాహన



ర్యాలీలో పాల్గొన్న ఎంపీడీఓ కుళ్లాయిబాబు, ఏపీఓ రామాంజనేయరెడ్డి

చింతకొమ్మదిన్నె : స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా శనివారం ఎంపీడీఓ కుల్లాయిబాబు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి ప్రజలకు, వ్యాపారస్తులకు తడి చెత్త, పొడి చెత్త వేరు చేయుటపై అవగాహన కల్పించారు.అలాగే స్థానిక షాపుల వద్దకు వెళ్లి సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను వాడరాదని, అమ్మకం చేయరాదని తెలిపారు. అలాగే స్థానిక గ్రామ సమీపంలో జరుగుతున్న ఉపాధి హామీ ద్వారా స్థానిక సర్పంచ్ మహేశ్వరి ఆధ్వర్యంలో ప్రారంభించిన ఫారంపాండ్ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీఓ రామాంజనేయులరెడ్డి, స్థానిక పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

హెల్మెట్ తప్పనిసరి



హెల్మెట్‌పై అవగాహన కల్పిస్తున్న సీఐ నరేష్‌బాబు

ఎర్రగుంట్ల : ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ వాడాలని పట్టణ సీఐ నరేష్‌బాబు తెలిపారు. శనివారం పట్టణ నాలుగు రోడ్ల కూడలిలో ఆయన యువతకు హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పించారు. హెల్మెట్ వినియోగించాలని లేని పక్షంలో ప్రమాదాలు జరిగినప్పుడు భారీగా నష్టపోతారన్నారు. ముఖ్యంగా యువత ఇష్టరాజ్యంగా బైకులను అతి వేగంగా నడుపుతుంటారన్నారు. మద్యం తాగి బైకులు నడపకూడదన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఉపాధి హామీ సోషల్ ఆడిట్ ఓపెన్ ఫోరం



ఓపెన్ ఫోరం సభలో రికార్డులను పరిశీలిస్తున్న పీడీ ఆదిశేషారెడ్డి

లింగాల : స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో శనివారం మహాత్మ గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పనులపై సోషల్ ఆడిట్ ఓపెన్ ఫోరం బహిరంగ సభ నిర్వహించారు. ఎంపీపీ రమాదేవి అధ్యక్షతన డీడబ్ల్యూఏ పీడీ ఆదిశేషారెడ్డి ఆధ్వర్యంలో ఈ సభను నిర్వహించారు. 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు మండలంలో నిర్వహించిన పనులపై ఎస్‌ఆర్పీ భాస్కర్ ఆధ్వర్యంలో మండలంలోని అన్ని గ్రామాల్లో గ్రామసభలను నిర్వహించి పనుల లోటుపాట్లను డీఆర్పీలు రికార్డు చేశారు. కూలీలకు రూ.5.42 కోట్లు, మెటీరియల్ పేమెంట్ కొరకు రూ.4.22 కోట్లు ఖర్చు చేశారు. ఓపెన్ ఫోరం సభలో డీఆర్పీలు ఉపాధి హామీ పనులలో జరిగిన లోటుపాట్లను రికార్డులను చదివి వినిపించారు. పనులకు సంబంధించి రూ.43,164లు రికవరీ చేయాలని, ఫార్మేషన్ రోడ్ల నిర్మాణంలో ముందుగా మస్టర్ల పేమెంట్ చేసి ఆ తర్వాత మస్టర్ పేమెంట్ చేయడం జరిగిందని, ఆ విధంగా చేయడం తప్పు అని భావించి పీడీ ఆదిశేషారెడ్డి ఉపాధి హామీ సిబ్బందికి రూ.1.36 లక్షలు జరిమానా విధించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి, డీవీఓ రామలింగేశ్వరరెడ్డి, ఏపీడీ సోమశేఖరరెడ్డి, ఏపీఓ గంగరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు మల్లికార్జునరెడ్డి, జూలు, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారి మృతితో ఆ ఇంట పెనువిషాదం



భర్త, చిన్న కూతురును పోగొట్టుకున్న శ్యామల, పక్కనే మృతి చెందిన కీర్తన

ముద్దనూరు : ఏడాది కాల వ్యవధిలోనే భర్త, చిన్నారి కూతురు అకస్మిక మరణంతో ఆ ఇంట విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ విషాద ఘటన మండలంలోని ఉప్పలూరు గ్రామంలో నివసిస్తున్న శ్యామల ఇంట చోటుచేసుకుంది. వివరాలలోకి వెళ్తే.. శ్యామలకు ఇరువురు కుమార్తెలు. ఆమె భర్త లక్షుమయ్య సుమారు ఏడాది క్రితం పాముకాటుకు గురై మృతి చెందాడు. శుక్రవారం గ్రామంలో జరుగుతున్న ఓ శుభకార్యంలో శ్యామల రెండవ కుమార్తె కీర్తన(6) కారు ఢీకొని దుర్మరణం చెందింది. ఏడాది వ్యవధిలోనే భర్త, చిన్న కుమార్తెను దూరం చేసుకున్న శ్యామల జీవితంలో తీవ్ర ఆవేదన మిగిలింది.

మైలవరం మండలంలో వడగండ్ల వాన



వద్దిరాలలో పడిన వడగండ్ల వాన



వడగండ్లను చూపుతున్న స్థానికులు

జమ్మలమడుగు : నియోజకవర్గంలోని మైలవరం మండలం వద్దిరాల గ్రామంలో వడగండ్ల వాన కురిసింది. శనివారం సాయంత్రం ఒక్కసారిగా ఆకాశంలో మేఘావృతమై వాతావరణం మారిపోయింది. జమ్మలమడుగు పట్టణంలో సన్నటి చినుకులు పడితే మైలవరం మండలం ప్రాంతంలో వడగండ్ల వాన కురిసింది. వేసవిలో వడగండ్ల వాన కురవడంతో స్థానికులు వడగండ్లను సేకరించడం కోసం పోటీ పడ్డారు. వేడితో అల్లాడిపోతున్న మైలవరం ప్రజలు వర్షం రావడంతో కాసింత ఉపశమనం కలిగిందని స్థానికులు భావిస్తున్నారు.

లింగాలలో..

లింగాల : మండలంలో శనివారం సాయంత్రం వర్షం కురిసింది. మండలంలోని పలు గ్రామాల్లో పదునుపాటి వర్షం కురిసింది. అకాల వర్షంవల్ల వడగండ్లు కురిసే ప్రమాదం ఉందని, దీనివల్ల చీనీ, అరటి రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అంగన్‌వాడీలకు అవగాహన కార్యక్రమం

పులివెందుల టౌన్ : పట్టణంలోని స్థానిక రమణమ్మ సత్రంబడి పాఠశాలలో శనివారం పోషణ భీ – పడాయి భీ కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ నిర్వహించారు.

ఈ సందర్భంగా హెచ్‌ఈ మలయ్య దివ్యాంగుల పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రంలో ఎలాంటి సలహాలు సూచనలు తల్లిదండ్రులకు ఇవ్వాలి, దివ్యాంగ పిల్లలను ఎలా గుర్తించాలి, స్క్రీనింగ్ షెడ్యూల్‌పై కేస్ స్టడీలు ఎలా నిర్వహించాలనే విషయాలను వివరించారు. అలాగే పిల్లల పెంపకం పద్ధతులపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించడం, మూడేళ్ల లోపు పిల్లల పోషణ స్థితిని గుర్తించడం, పిల్లలకు ఏర్పడే సమస్యలను తల్లులకు క్షుణ్ణంగా వివరించారు. నెలవారీ ఈసీసీఈలో ఎలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నది తల్లులకు తెలియజేశారు.

చలివేంద్రాలు మరిన్ని ఏర్పాటు చేయాలి



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సీఐ రోషన్

కమలాపురం : జన సంచారం అధికంగా ఉన్న ప్రాంతాల్లో మరిన్ని చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని సీఐ ఎస్‌కే రోషన్, ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక క్రాస్ రోడ్డులో మన ఊరు సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవి కాలంలో చలివేంద్రాలు పాదాచారులకు, ప్రయాణీకులకు, వాహన చోదకులకు వరం లాంటివన్నారు. ప్రజల దాహార్తిని తీర్చే చలివేంద్రాలను జన సంచారం అధికంగా ఉన్న చోట్ల మరిన్ని ఏర్పాటు చేయాలని వారు దాతలకు సూచించారు. చలివేంద్రం ఏర్పాటు చేసిన మన ఊరు సేవాసమితి అధ్యక్షుడు శీలం శ్రీనువాసులును వారు అభినందించారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలను పాటించాలి

కమలాపురం : వాహన చోదకులు తప్పనిసరిగా రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని సీఐ ఎస్‌కే రోషన్, ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక క్రాస్ రోడ్డులో వాహన చోదకులకు రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పించారు.

వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. అలాగే కార్లు నడిపే వారు సీట్ బెల్ట్ ధరించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని, వెహికల్ రికార్డులు, డ్రైవింగ్ లైసెన్స్‌లు తప్పనిసరిగా కలిగి ఉండాలన్నారు. ట్రిబుల్ రైడింగ్, రాంగ్ రూట్‌లో, సెల్ ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదన్నారు. వాహనాలు నడిపే వారు ఒక్కసారి మీ కుటుంబాన్ని గుర్తు చేసుకోవాలన్నారు. అత్యంత వేగం ప్రమాదకరం అని, స్పీడ్ లిమిట్ మించి పోకూడదన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

సంస్కృతిని పునరుజ్జీవనం చేసుకోవాలి

జమ్మలమడుగు రూరల్ : భారతదేశంలో సంస్కృతి సంప్రదాయాలను ప్రజలు పునరుజ్జీవనం చేసుకోవాలని ప్రముఖ రచయిత వేంపల్లె షరీఫ్ తెలిపారు. శనివారం సాహితీవేత్తలు ఇచ్చిన పిలుపుమేరకు స్థానిక ఎస్సీ డిగ్రీ కళాశాలలో విద్యార్థులతో కలసి ఆయన మాటా మంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. షరీఫ్ రచించిన రచనల్లో మూడు పుస్తకాల నుండి మూడు కథలను చదివి వినిపించారు. అనంతరం సాహితీవేత్తలు వేంపల్లె షరీఫ్, ఎం జయదేవ్‌లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సాహితీవేత్తలు దర్పణం శ్రీనివాస్, డాక్టర్ ఎంఎల్ నారాయణరెడ్డి, ఎం.శివ గణపతి, కళాశాల కరస్పాండెంట్ పి.నాగేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెట్రోలు బంకు సమీపంలో మంటలు



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

లింగాల : లింగాలలోని భారత్ పెట్రోలు బంకు సమీపంలో శనివారం మంటలు చెలరేగాయి. పెట్రోలు బంకు సమీపంలో ఉన్న అరటి పంటను పొలం గట్లపై ఉంచారు. పులివెందుల–ప్రధాన రహదారి పక్కనే ఉన్నందున ద్విచక్ర వాహనదారులు సిగరెట్ లేదా బీడీ తాగి వాటిపై వేయడంతో మంటలు చెలరేగాయి. దీంతో పెట్రోలు బంక్‌కు ప్రమాదం సంభవిస్తుందని బంకు యజమాని రాంబాబు ఫైర్‌స్టేషన్‌కు ఫోన్ చేసి సమాచారమందించారు. దీంతో అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు.

తాగు నీటి సమస్యను పరిష్కరించండి

వేంపల్లె : గ్రామపంచాయతీలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం తక్షణమే చర్యలు తీసుకోవాలని మండల తహసీల్దార్ హరినాథరెడ్డికి శనివారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులు వినతిపత్రం సమర్పించారు.

ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తులసిరెడ్డి, పార్టీ ఇన్‌చార్జి ధ్రువకుమార్‌రెడ్డిలు మాట్లాడుతూ వేసవి ప్రారంభంలోనే తాగునీటి సమస్య ఉత్పన్నం కావడం శోచనీయమన్నారు. తాగునీటి సమస్యపై ప్రభుత్వం దృష్టి సారించి పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.